విదేశీ డిప్లమా కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 24: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని విదేశీ భాషల డిప్లమా కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ పరీక్షల విభాగం, కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఫ్రెంచ్, జర్మన్ భాషల్లో జూనియర్, సీనియర్, అడ్వాన్స్‌డ్ డిప్లమా కోర్సుల రెగ్యులర్ పరీక్షా ఫీజును వచ్చే నెల 5వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో 12వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను ఏప్రిల్ నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్:- www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

డిగ్రీ కోర్సుల పరీక్షా ఫలితాల విడుదల

ఓయూ పరిధిలోని డిగ్రీ కోర్సుల పరీక్షా ఫలితాలను శనివారం విడుదల చేశారు. బీఏ, బీబీఏ, బీకామ్, బీఎస్సీ తదితర కోర్సుల మొదటి, మూడు, అయిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను విడుదల చేశామన్నారు.

27న ఓయూలో మహిళల జాబ్ మేళా

ఓయూ పరిధిలోని యూనివర్సిటీ ఎంప్లాయ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరో (మోడల్ కెరియర్ సెంటర్)లో ఈ నెల 27న మహిళల కోసం ప్రత్యేక జాబ్ మేళా నిర్వహించనున్నట్లు బ్యూరో డిప్యూటీ చీఫ్ టి.రాము ఒక ప్రకటనలో తెలిపారు. రిలయెన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో ఉద్యోగాల కోసం ఈ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మేళాకు హాజరయ్యేందుకు డిగ్రీ, పీజీ అర్హతలు కలిగిన వారు అర్హులుగా పేర్కొన్నారు. 29 నుంచి 45 ఏళ్ల మధ్య వయసులో ఉన్న స్త్రీలు ఎవరైనా మేళాకు హాజరుకావొచ్చని వివరించారు. అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్లతో మేళాకు హాజరుకావాలని సూచించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇతర వివరాలకు ఫోన్ నం. 83400 37123లో సంప్రదించాలని సూచించారు.

మురుగు నీరు యథేచ్ఛగా సాగర్‌లోకి

- పడిపోతున్న హుస్సేన్ సాగర్ నీటి నాణ్యత
- పరిమితికి మించిన బీఓడీ, ఘన వ్యర్థాల పరిమాణం
- కాలానుగుణంగా నీటి నాణ్యతలో మార్పులు
- నివేదికలో వెల్లడించిన పీసీబీ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 24(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగర పర్యాటక కేంద్రంగా ఉన్న హుస్సేన్ సాగర్‌లో రోజు రోజుకూ నీటి నాణ్యత పడిపోతుంది. యథేచ్ఛగా కలుస్తున్న మురుగు నీరు, వర్షపు నీటి ప్రవాహం తగ్గిపోవడంతో నీటిలో మార్పులొస్తున్నాయి. తాజాగా పడిపోతున్న నీటి నాణ్యతపై పీసీబీ వెల్లడించిన నివేదికలోనూ వెల్లడికాగా, అధికారులు తీసుకునే చర్యలతో హుస్సేన్ సాగర్‌లో జీవజాలం మనుగడ ప్రమాదంలో పడేలా ఉంది. అయితే, పదేళ్ల క్రితంతో పోలిస్తే హైదరాబాద్ హుస్సేన్ సాగర్ మెరుగుపడినా, నీటి నాణ్యతను మెరుగుపరిచేలా ప్రత్యేక కార్యాచరణ అవసరమని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు.

పడిపోతున్న నాణ్యత

యథేచ్ఛగా కలుస్తున్న మురుగునీటితో నగరం నడి బొడ్డున ఉన్న హుస్సేన్ సాగర్ నీటి నాణ్యత పడిపోతుంది. దీంతో పాటు కాలుష్య కారకాలు, మురుగు నీటిలో ఉండే లోహ మిశ్రమాలతో పాటు, బంజారా నాలా ద్వారా విడుదలవుతున్న శుద్ధి చేయని డ్రైనేజీ నీటితో రిజర్వాయర్ పర్యావరణం దెబ్బతింటుంది. 2023లో రూపొందించిన పీసీబీ నివేదిక ప్రకారం, హుస్సేన్ సాగర్‌కు కీలకమైన నెక్లెస్ రోడ్డు ప్రాంతంలో నీటి నాణ్యత దారుణంగా ఉందని తేలింది. ప్రధానంగా బయోలాజికల్ ఆక్సిజన్ డిమాండ్, కెమికల్ ఆక్సిజన్ డిమాండ్‌తో పాటు, ఘన వ్యర్థాలు, కోలిఫాం నిర్ణీత ప్రమాణాల కంటే ఎక్కువ మొత్తంలో ఉందని వెల్లడైంది. అయితే, నీటి పీహెచ్ లెవల్ 6.63-7.63 మధ్య స్థిరంగానే ఉండగా, ఎలక్ట్రికల్ కండెక్టివిటీ(ఈసీ) విలువ అధికంగా ఉండటం నీటిలో ఉండే ఖనిజ లవణాలకు ప్రామాణికమని పీసీబీ వర్గాలు వెల్లడించాయి.

జలావరణానికి ప్రమాదం...

క్రమంగా నీటి నాణ్యత పడిపోవడానికి ప్రధాన కారణాలుగా శుద్ధి చేయని మురుగు నీరు యథేచ్ఛగా చేరడంతో పాటు, మానవ వ్యర్థాల పరిమాణమని పీసీబీ వర్గాలు చెబుతున్నాయి. నీటిలో బయోలాజికల్ ఆక్సిజన్ డిమాండ్ పడిపోతే గనుక జలావరణానికి ప్రమాదంగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. బంజారాహిల్స్ నాలా నుంచి వచ్చే మురుగు నీటితోనే హుస్సేన్ సాగర్‌లో నీటి నాణ్యత తగ్గుతుందన్నారు. అయితే, హుస్సేన్ సాగర్ జలాలను పరిరక్షించాలంటే సమర్థవంతంగా పనిచేసే ఎస్టీపీలతో పాటు, నిరంతరం ప్రవహించే మంచినీరు, లేదా 100 శాతం శుద్ధి చేసిన మురుగునీటితోనే సాధ్యమని, దీంతో పాటు ఏటా వేసవిలో ఆవిరైపోతున్న నీటితో కూడా నాణ్యత కొంత మేర తగ్గుతుందని పీసీబీ అధికారులు చెబుతున్నారు.

తప్పుడు సమాచారంపై అప్రమత్తంగా ఉందాం

హెల్త్ జర్నలిస్టుల జాతీయ సదస్సులో వక్తలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 24(నమస్తే తెలంగాణ): వైద్య రంగంలో వస్తున్న కొత్త ఒరవడులను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మీడియా పాత్ర కీలకమని పలువురు వైద్య నిపుణులు అభిప్రాయపడ్డారు. ఢిల్లీ ఎయిమ్స్‌లో నిర్వహించిన హెల్త్ జర్నలిస్టులు, ప్రభావితుల జాతీయ సదస్సులో దేశ వ్యాప్తంగా ఉన్న పలువురు వైద్య నిపుణులు, హెల్త్ జర్నలిస్టులు, మీడియా, సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పలువురు వైద్య నిపుణులు మాట్లాడుతూ, వైద్య రంగానికి సంబంధించిన అంశాలను ప్రభావితం చేయడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రధానంగా ఈ మధ్య కాలంలో సోషల్ మీడియా వల్ల ప్రజలు అనుకూల, ప్రతికూలంగా కూడా ప్రభావితమవుతున్నట్లు తెలిపారు. వైద్య రంగంలో వచ్చే ఆధునిక వైద్య పద్ధతులు, రోగ నిర్ధారణ పద్ధతులు, ఔషధాలు, వాటి ఫలితాలు వంటి అంశాలను మీడియా ఖచ్చితమైన సమాచారంతో ప్రజల్లోకి తీసుకెళ్లాలని, దీని వల్ల రోగులకు సరైన చికిత్స లభిస్తుందని అభిప్రాయపడ్డారు. కొన్ని రకాల సోషల్ మీడియా, మీడియా ప్లాట్‌ఫామ్స్ ద్వారా తప్పుడు సమాచారం ప్రజల్లోకి వెళ్లడంతో ప్రాణనష్టం జరిగే ప్రమాదం లేకపోలేదని, అలాంటి ఘటనలు చాలానే జరుగుతున్నట్లు వక్తలు వాపోయారు. ఏదైనా మీడియా లేదా సోషల్ మీడియా ద్వారా ఇలాంటి తప్పుడు సమాచారం వచ్చిన వెంటనే వైద్యనిపుణులు స్పందించి, ప్రజలకు సరైన సూచనలు చేయాలన్నారు. వైద్యరంగంలో వచ్చిన కొత్త అంశాలను మీడియా, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ద్వారా ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత అటు వైద్య నిపుణులు, ఇటు మీడియా ప్రతినిధులపై కూడా ఉందన్నారు. ముఖ్యంగా ఏదైనా ఒక వ్యాధి గురించి లేదా చికిత్సా పద్ధతులు, వ్యాధి నిర్ధారణ పద్ధతులు లేదా కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఔషధాల గురించిన అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లినప్పుడు నిష్ణాతులైన వైద్యనిపుణుల అభిప్రాయాలతో కూడిన స్పష్టమైన, ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించి ప్రజలకు చేరవేయాలన్నారు. మీడియా, హెల్త్ రైటర్స్, సోషల్ మీడియా ఇచ్చే ఇలాంటి సమాచారం ప్రజలను ఎంతగానో ప్రభావితం చేస్తుందని పలువురు వైద్యనిపుణులు తెలిపారు. అనంతరం టీబీ, డయాబెటిక్, ఒబేసిటి, క్యాన్సర్, కిడ్నీ, హార్ట్‌టాక్ తదితర దీర్ఘకాలిక వ్యాధులు, వైద్యరంగంలో వస్తున్న డిజిటల్ పద్ధతులు తదితర అంశాలపై వైద్యనిపుణులు, వైద్య సాంకేతిక నిపుణులు చర్చించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టీబీ అండ్ రెస్పిరేటరీ డిసీజెస్ (ఎన్ఐటీఆర్‌డి), టీబీ అండ్ చెస్ట్ డిసీజెస్ విభాగం ప్రొఫెసర్ అండ్ హెచ్‌ఓడీ డాక్టర్ రూపక్ సింగాల్,

ఎన్‌టీఈపీ సెంట్రల్ టీబీ డివిజన్ అడిషనల్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సంజయ్ కె మట్టూ, న్యూ ఢిల్లీ ఎయిమ్స్ పల్మనరి, క్రిటికల్ కేర్ అండ్ స్లీప్ మెడిసిన్ విభాగం అడిషనల్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ్ హడ్డ, ఢిల్లీ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ గిరీష్ త్యాగి, అసోసియేషన్ ఆఫ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ కేతర్ పాల్, జపాన్ హొరిబా కార్పొరేట్ ఆఫీసర్ డాక్టర్ రాజీవ్ గౌతమ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, పంజాబ్ తదితర రాష్ట్రాలకు చెందిన హెల్త్ రిపోర్టర్లు, రచయితలు తదితరులు పాల్గొన్నారు.

కో ఆపరేటివ్ రంగం బలోపేతానికి కృషి

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 24: తెలంగాణ రాష్ట్రంలో కో ఆపరేటివ్ రంగం బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆల్ ఇండియా కో-ఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ 8 సర్వసభ్య సమావేశం బాగ్ లింగంపల్లి ఆర్టీసీ కళా భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తున్నామన్నారు. కో ఆపరేటివ్ బ్యాంకుల్లో పనిచేస్తున్న ఉద్యోగుల డిమాండ్లు ఆమోదయోగమైనవని, ఈ డిమాండ్ల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, రైతులకు కో-ఆపరేటివ్ బ్యాంకులు ఎంతో సేవలందిస్తున్నాయన్నారు. కో-ఆపరేటివ్ బ్యాంకులను బలోపేతం చేయాలని, అదే విధంగా కో-ఆపరేటివ్ బ్యాంకులో పనిచేస్తున్న ఉద్యోగులకు పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐబీఈఏ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు, ఆల్ ఇండియా కో ఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.సురేందర్, పీఎస్‌సీఎబీ ప్రెసిడెంట్ గోంగడి మహేందర్ రెడ్డి, కె.నాగభూషణయ్య, డక్టార్ ఎన్.మురళీధర్, చిట్టి దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విపత్తు నిర్వహణలో డీఆర్ఎఫ్ సేవలు భేష్

మేయర్ గద్వాల విజయలక్ష్మి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 24(నమస్తే తెలంగాణ): విపత్తుల నిర్వహణలో జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ హైదరాబాద్ మహా నగరంలో అందిస్తున్న సేవలు అభినందనీయమని మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. డీఆర్ఎఫ్ విభాగం రూపొందించిన కాఫీ టేబుల్ బుక్‌ను ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డితో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా పట్టణ విపత్తు నిర్వహణ దళం హైదరాబాద్‌లోనే ఉన్నదన్నారు. 2018లో డీఆర్ఎఫ్‌ను బల్దియా ఏర్పాటు చేసిందని ఆమె తెలిపారు. అదే స్ఫూర్తితో తెలంగాణలోని పలు నగరాల్లో డీఆర్ఎఫ్ ఏర్పాటు చేయగా, ఆ సభ్యులకు జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ అధికారుల బృందమే శిక్షణను ఇచ్చిందన్నారు. ప్రస్తుతం 27 డీఆర్ఎఫ్ బృందాలు ఉండగా, వీటి సంఖ్యను 30కి పెంచే ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. కాగా, నగరంలో సంభవించే ప్రమాదాలు, విపత్తులపై ప్రజలకు అవగాహన కల్పించడంలో ఈ కాఫీ బుక్ ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో సంభవించిన వరదల సమయంలో, అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు, ఈదురు గాలులకు చెట్లు పడినప్పుడు, భవనాలు కూలిపోయినప్పుడు, ఇతర ప్రమాదకర పరిస్థితుల్లో డిజాస్టర్ రెస్పాన్స్ బృందాలు అందించిన సేవలపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈవీడీఎం డైరెక్టర్‌తో పాటు, ఫైర్, డీఆర్ఎఫ్ అధికారులు ఉన్నారు.

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావు

మఖ్దూంభవన్‌లో సాంబశివరావుకు వినతి పత్రాన్ని అందజేస్తున్న సబ్బు రాజమౌళి

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 24: రాష్ట్ర వ్యాప్తంగా టూరిజం సంస్థలో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలను పరిష్కారం చేయాలని ఇటీవల జరిగిన అసెంబ్లీలో ప్రస్తావించినందుకు శనివారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో సాంబ శివరావును టూరిజం కాంట్రాక్ట్ ఉద్యోగులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సమాన పనికి సమాన వేతనంతో పాటు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కారం చేయాలని టూరిజం సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌కు లేఖ రాసినట్లు సాంబశివరావు చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ టూరిజం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి, నాయకురాలు జ్యోతి, రచన, రాజ్యలక్ష్మి, సుకన్య పాల్గొన్నారు.

విభజన హామీల కోసం పోరాడాలి

జై భారత్ అధ్యక్షులు, రిటైర్డ్ సీబీఐ జేడీ వీవీ లక్ష్మినారాయణ

సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మినారాయణ

ఖైరతాబాద్, ఫిబ్రవరి 24: విభజన హామీలను పోరాడి సాధించుకోవాలని జై భారత్ అధ్యక్షులు, రిటైర్డ్ సీబీఐ జేడీ వీవీ లక్ష్మినారాయణ పిలుపునిచ్చారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విభజన హామీల సాధన సమితి అధ్యక్షులు సీహెచ్ శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడుతూ, రాష్ట్రం విడిపోయి పదేండ్లు కావొస్తున్నా నేటికీ విభజన హామీలు నెరవేర్చలేదన్నారు. ఏపీ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, తెలంగాణలోని కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం తదితర హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. కృష్ణా, గోదావరి బేసిన్‌లో ఇటీవల ముడిచమురు ఉత్పత్తి మొదలైందని, స్టాండింగ్ కమిటీ నివేదిక ప్రకారం, అందులో రెండు రాష్ట్రాలకు 50 శాతం వాటా రావాలన్నారు. అలాగే సింగరేణి గనులపై కూడా రెండు రాష్ట్రాల ప్రభుత్వాలకు అధికారం ఉండాలని, ఈ విషయంపై కేంద్రంతో ఉమ్మడిగా పోరాడాలన్నారు. ఈ సమావేశంలో సౌత్ ఇండియా పొలిటికల్ జేఏసీ అధ్యక్షులు ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, ఆంధ్రా ఇంటలెక్చువల్ ఫోరం ప్రతినిధి అలహరి వెంకటేశ్వర్ రావు, సమైక్యాంధ్ర పార్టీ అధ్యక్షులు జి.కుమార్ చౌదరి యాదవ్ పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్..

మల్రి లక్ష్మణ్ రెడ్డి విద్యా సంస్థలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శనివారం ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఆ చైర్మన్ మల్రి లక్ష్మణ్‌రెడ్డి

దుండిగల్, ఫిబ్రవరి 24: నగర శివారు, దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, దుండిగల్‌లోని మల్రి లక్ష్మణ్ రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఎంఎల్ఆర్ఐటీఎం), ఫార్మసీ కళాశాలలో 'వెలారస్ 2కే 24' పేరిట రెండు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం(టెక్ ఫెస్ట్) శనివారంతో ముగిసింది. ఈ సాంకేతికోత్సవంలో వివిధ రాష్ట్రాలలోని ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలకు చెందిన విద్యార్థులు 4 వేలకు పైగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాము రూపొందించిన నూతన ఆవిష్కరణలు ప్రదర్శించారు. రోబోటిక్స్, కోడింగ్ అండ్ డీబగ్గింగ్, బిల్లింగ్ ఆర్కిటెక్షర్, బిజినెస్ ఈ-సమ్మిట్, పేపర్ ప్రెజెంటేషన్, వెల్డింగ్, బ్యాటరీ వెహికల్స్ నమూనాల ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ముగింపు ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా ఎంఎల్ఆర్ విద్యా సంస్థల చైర్మన్, వెటరన్ అథ్లెట్ మల్రి లక్ష్మణ్ రెడ్డి, ఇండియన్ రొబోటిక్ అసోసియేషన్ అధ్యక్షులు పి.కిషన్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఉగాది పురస్కారాలకు దరఖాస్తులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 24(నమస్తే తెలంగాణ): అర్హత కలిగిన సాహితీవేత్తలు, పలు రంగాల్లో నిష్ణాతులైనవారు అంతర్జాతీయ ఉగాది పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని ఫెడరేషన్ ఆఫ్ ఎన్నారై కల్చరల్ అసోసియేషన్(ఎఫ్ఎన్‌సీఏ) అంతర్జాతీయ ప్రెసిడెంట్ డాక్టర్ మిరియాల జానకీరామ వరప్రసాద్ తెలిపారు. హైదరాబాద్‌లోని ఎఫ్ఎన్‌సీఏ బ్రాంచ్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మలేషియా శాఖ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలను అందజేయనున్నట్లుగా వెల్లడించారు. విద్యా, వైద్య, వైజ్ఞానిక, విజ్ఞాన, సామాజిక, సాంస్కృతిక, సాహిత్య, సాహితీ, సేవ, సినీ, క్రీడా రంగాల్లో నిష్ణాతులైన వారు ఏప్రిల్ 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల పరిశీలన తర్వాత సంస్థ ఎంపిక చేసిన మే 10న అంతర్జాతీయ ఉగాది సాఫల్య పురస్కారాలను కౌలాలంపూర్‌లో అందజేస్తామన్నారు. వివరాలకు ఫోన్ నం. 96669 10480ను సంప్రదించాలన్నారు.

నేడు బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

మియాపూర్, ఫిబ్రవరి 24: మియాపూర్ గాయత్రీ బ్రాహ్మణ అసోసియేషన్ ఆధ్వర్యంలో 13వ రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ వివాహ పరిచయ వేదికను ఆదివారం మియాపూర్ జనప్రియా అపార్టుమెంట్స్ షిర్డీ సాయిబాబా ఆలయంలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రతినిధి మూర్తి శనివారం తెలిపారు. వేదికలో పాల్గొనే వారు స్పాట్ రిజిస్ట్రేషన్ సైతం చేయించుకోవచ్చునన్నారు. ఉదయం 9 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని, సాయంత్రం వరకు కొనసాగుతుందని, ఆసక్తి కల వారు ఇందులో పాల్గొనవచ్చునని మూర్తి తెలిపారు. వివరాలకు ఫోన్ నం: 99483 21233/ 79814 13159/ 92468 44496/ 93469 71918/ 97044 05065/ 83740 65225.

సీడీఎఫ్‌డీలో ఎయిర్‌ఫోర్స్ ఇంటెలిజెన్స్ విభాగం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 24(నమస్తే తెలంగాణ): పుణేలోని ఎయిర్‌ఫోర్స్ ఇంటెలిజెన్స్ విభాగంలోని అధికారుల బృందం సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్‌ను సందర్శించారు. డీఎన్ఏ, ఫింగర్ ప్రింటింగ్‌లో అపారమైన విజ్ఞానంతో పాటు మెరుగైన పరిశోధన వసతులను కలిగిన సీడీఎఫ్‌డీలో పలు అంశాలపై ఎయిర్‌ఫోర్స్ విభాగానికి చెందిన అధికారులకు వివరించారు. ప్రధానంగా నేరాల దర్యాప్తులో ఫోరెన్సిక్ కేసుల వివాదాల్లో అమలు చేయాల్సిన పరిశోధన ప్రోటోకాల్స్ గురించి ఈ సందర్భంగా ఎయిర్ ఫోర్స్ అధికారులకు సీడీఎఫ్‌డీ సైంటిస్టులు వివరించారు.

29 నుంచి ప్రత్యంగిరా దేవి బ్రహ్మోత్సవాలు

ప్రత్యంగిరా దేవి బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్

ఆర్కేపురం, ఫిబ్రవరి 24 : ఆర్కేపురం డివిజన్‌లోని కుర్తాళం పీఠం ఆదిపరాశక్తి శ్రీ ప్రత్యంగిరా దేవి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 29వ తేదీ నుంచి మార్చి 2 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆలయ ఆవరణలో బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఠాధిపతులు జగద్గురు శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానందభారతి మహా స్వామి ఆశీస్సులతో జరగనున్న బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజు విశేష 18 రకాల అభిషేకాలు, హోమాలు, మహిళలతో కుంకుమార్చన, భక్తి సంగీతం, మహా నక్షత్ర హారతులు, చివరి రోజు సాయంత్రం పల్లకీ సేవ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఠల్‌శర్మ, సాయికుమార్‌శర్మ, హేమంత్‌శర్మ, రామశర్మ, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మి, రమాదేవి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీబీఎస్‌లో కార్డన్ సెర్చ్

సుల్తాన్ బజార్, ఫిబ్రవరి 24: నిత్యం ప్రయాణికుల రాకపోకలతో రద్దీగా ఉండే గౌలిగూడ మహాత్మా గాంధీ బస్ స్టేషన్ ఆవరణలో శనివారం సాయంత్రం ఈస్ట్ జోన్ అదనపు డీసీపీ పృథ్వీరాజ్ నేతృత్వంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సుల్తాన్ బజార్, అప్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు ముత్తు, హరిభూషణ్ రావుల ఇందులో పర్యవేక్షించారు. కాగా, వంద మంది పోలీస్ సిబ్బంది డాగ్ స్క్వాడ్ బృందాలతో కలిసి కార్డన్ సెర్చ్‌లో పాల్గొన్నారు. ప్రయాణికుల లగేజీ బ్యాగ్‌లను తనిఖీ చేయడంతో పాటు సంబంధిత పత్రాలు లేని ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని పరిస్థితిని సమీక్షించారు.

అర్బన్ మేనేజ్‌మెంట్‌పై ఫ్రాన్స్ ప్రతినిధుల భేటీ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 24(నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ఫ్రాన్స్ అధికార ప్రతినిధుల బృందం శనివారం సందర్శించింది. బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌తో బృంద సభ్యులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆ దేశంలోని స్థానిక సంస్థల్లో చేపట్టిన విధి విధానాలపై బల్దియా అధికారులకు వివరించారు. అనంతరం, జీహెచ్ఎంసీ చేపట్టిన ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాలను ఫ్రాన్స్ బృందానికి కమిషనర్ రొనాల్డ్ రాస్ తెలిపారు. ప్రధానంగా చెరువుల అభివృద్ధి, సుందరీకరణతో పాటు నగరంలో ఉపాధిని కల్పించేలా చేపట్టిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలపై ఆ బృందంతో చర్చించారు. ఫ్రాన్స్ దేశ సహకారంతో గతంలో చేపట్టిన అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. బార్డెక్స్ మెట్రోపాలిటన్‌తో తెలంగాణ ప్రభుత్వం 2015లో ఒప్పందం చేసుకుందని వివరించారు. 2021-22లో సాకి వాటర్ స్వచ్ఛంద సంస్థ ద్వారా అర్బన్ ట్రయల్స్ ద్వారా వాటర్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌ను చేపట్టినట్లుగా కమిషనర్ తెలిపారు. కాగా, అర్బన్ మేనేజ్‌మెంట్ కింద ముఖ్యమైన అంశాలపై చర్చించేందుకు ఫ్రాన్స్ బృందం హైదరాబాద్ పర్యటించినట్లుగా ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో కమిషనర్ తెలిపారు.

మున్నూరు కాపులకు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ దేవయ్య పటేల్

సమావేశంలో అభివాదం చేస్తున్న డాక్టర్ దేవయ్య, రవి కుమార్, సంజీవ్, సంఘం నాయకులు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 24: రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన సామాజికవర్గమైన మున్నూరు కాపులకు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొండా దేవయ్య పటేల్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మ